సాక్షి జగిత్యాల
సోమవారం ׀ 15 ׀ సెప్టెంబర్ ׀ 2025

భారత్.. జయహో..

రాయికల్: ఆసియాకప్ టీ20 క్రికెట్ పోటీలో పాకిస్తాన్‌పై భారత్ జట్టు విజయం సాధించడంపై జిల్లాలో సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి రాయికల్ పట్టణంలో యువ చైతన్య సభ్యులు, యవకులు టపాసులు కాల్చారు. స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.



న్యూస్‌రీల్

పసిబిడ్డ వైద్యానికి 'నవదుర్గ' చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న నవదుర్గ సేవ సమితి సభ్యులు

రాయికల్: పట్టణానికి చెందిన కట్టెకోల సుధాకర్, అర్చన దంపతుల కూతురు బరువు తక్కువ ఉండడంతో వైద్యానికి డబ్బులు అవసరం అయ్యాయి. ఈ విషయాన్ని 'సాక్షి'ఈనెల 9న 'పసిబిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన నవదుర్గ సేవా సమితి (మార్కండేయ నగర్) ఆధ్వర్యంలో రూ.28,500ను ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు గంట్యాల ప్రవీణ్, ఉపాధ్యక్షులు మధు, శ్రీరాముల సాయి ప్రధాన కార్యదర్శి మూర చైతన్య, కోశాధికారి రాము, గౌరవ అధ్యక్షులు గట్టు వినయ్, గొల్లవర్తి భరత్, సుజిత్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఉచిత శస్త్రచికిత్స అనంతరం రోగులతో ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: నాలుగు దశాబ్దాలుగా రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పావని కంటి ఆస్పత్రి, ఆపి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 22మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. మందులు, కళ్లజోళ్లు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి కళ్లకు సంబంధించిన మైక్రో శస్త్రచికిత్స మిషన్ అందుబాటులోకి వచ్చిందని, వైద్యులు కూడా అందుబాటులో ఉంటారని, రోగులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ మంచాల కృష్ణ, సభ్యులు చారి, టీవీ.సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్, వైద్యులు ధీరజ్, విజయ్ ఉన్నారు.

బతుకమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్కార భారతి ప్రతినిధులు

జగిత్యాలటౌన్: ఈనెల 21నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. సంస్కార భారతి సాహిత్య విభాగం రాష్ట్ర కన్వీనర్ గంట్యాల ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ ఉత్సవాలన్నారు. పూలను పూజించే బతుకమ్మ పండుగను తెలంగాణతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భీమయ్య, ఉపాధ్యక్షుడు కట్ట విజయ్, రచయిత్రి, ఉపాధ్యాయురాలు అయిత అనిత, సుచరిత, వేముల చంద్రశేఖర్, గొల్లపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించండి



మాట్లాడుతున్న నాయకులు

మల్లాపూర్: ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, లేకుంటే చెరుకు రైతులతో కలిసి ఉద్యమిస్తామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల కాంతయ్యాచారి అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. చెరుకు రైతులను మభ్యపెట్టేందుకే పునరుద్ధరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే షుగర్ ఫ్యాక్టరీ అంశాన్ని వాడుకున్నట్లు రైతులకు అర్థమైందన్నారు. ఫ్యాక్టరీ అంశాన్ని ఎంపీ అర్వింద్‌కు అప్పగిస్తే తెరిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బూత్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎర్రోళ్ల నర్సారెడ్డి, ఎగ్యారపు శ్రీకాంత్, నరేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట చిమ్మ చీకట్లు..!

- వీధిదీపాలు లేక ఇబ్బందులు
- అంధకారంలో ప్రధాన రోడ్లు
- పెరుగుతున్న దొంగతనాలు
- కుక్కల బెడదతో భయంభయం
- ప్రమాదాల బారిన వాహనదారులు



➡ ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని టవర్‌సర్కిల్. ఇక్కడ వీధిలైట్లు సక్రమంగా లేవు. నిత్యం వందలాది మంది వ్యాపారాలు కొనసాగిస్తుంటారు. వీధి దీపాలు లేకపోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాల లైట్ల వెలుగులే వారికి దిక్కవుతున్నాయి.



➡ ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని సార్గమ్మ వీధి. ఇది కూడా ప్రధాన రహదారే. ఈ ఏరియాలోనూ లైట్లు లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఒకవైపు కుక్కల బెడద.. మరోవైపు కోతులు. ఇటీవల చైన్‌స్నాచింగ్‌లు అనేకం చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ప్రతి కాలనీలో లైట్లు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



➡ ఇది బైపాస్‌రోడ్‌లోని ప్రధానమైన జాంబాగ్ ప్రాంతం. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి అయిందంటేనే భయాందోళనకు గురవుతున్నారు. పూర్తిగా చిమ్మచీకట్లు కమ్ముకుంటాయి. ఇది బైపాస్ కావడంతో ఇటు నుంచి ప్రధాన వాహనాలు సైతం వెళ్తుంటాయి. లైట్లు లేకపోవడంతో భయాందోళనకరంగా మారింది.



➡ ఈ చిత్రం టవర్‌సర్కిల్ ప్రాంతంలోని మరో గల్లీ. ఇక్కడ కూడా లైట్లు వెలగడం లేదు. అటువైపు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు రాత్రిపూట వెళ్లాలంటేనే జంకుతున్నారు.



➡ ఇది ముప్పారపు ట్యాంక్‌రోడ్ సమీపంలోని రోడ్డు. ఇది బైపాస్‌కు లింక్‌గా ఉంటుంది. ఇక్కడా లైట్లు లేవు. సాయంత్రం వేళ వాకర్స్ వెళ్తుంటారు. ఏడు గంటలు దాంటిందంటే అటువైపు రావాలంటేనే భయపడుతున్నారు. వీధిదీపాల ఏర్పాటులో మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.



ఇది బైపాస్‌రోడ్‌లోని ధర్మపురి వెళ్లే ప్రాంతం. ఇక్కడ రెండు కిలోమీటర్ల వరకు స్ట్రీట్‌లైట్లు లేవు. రాత్రివేళలో వాహనదారులు, మహిళలు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల కరెంట్ స్తంభాలు కూడా లేవు.

జగిత్యాల: ఆడపిల్లలు, మహిళలు ఏటా ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగ సమీపించింది. ఇప్పటికే బొడ్డెమ్మ వేడుక ప్రారంభమయ్యింది. అయితే జిల్లాకేంద్రమైన జగిత్యాల బల్దియాలో వీధిదీపాలు లేక వారంతా ఇబ్బంది పడుతున్నారు. ఐదేళ్లకోసారి పాలకవర్గాలు మారుతున్నా.. స్పెషల్ ఆఫీసర్ల పాలన ఉన్నా సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. జగిత్యాల గ్రేడ్–1 మున్సిపాలిటీ. అయినప్పటికీ ఏ ఒక్క కాలనీలోనూ వీధిదీపాలు లేకపోవడం ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అసలే కుక్కలు, పోకిరీల బెడద ఎక్కువవుతోంది. చైన్‌స్నాచింగ్ సంఘటనలు అధికంగా చోటుచేసుకుంటున్నాయి. వీధిదీపాలు ఉంటే పరిస్థితిలో కొంత మార్పు వచ్చే అవకాశమున్నా.. అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. మొన్నటివరకు ఓ ప్రైవేటు సంస్థ కాంట్రాక్టు ప్రకారం.. వీధిదీపాలు వేసేది. ఆ కాంట్రాక్టు ఒప్పందం ముగిసిపోవడంతో బల్దియా అధికారులు వీధిదీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొన్నిచోట్ల వీధి స్తంభాలున్నా లైట్లు లేకపోవడం.. మరికొన్ని చోట్ల కరెంట్ స్తంభాలే లేకపోవడంతో రాత్రి ఏడు గంటలు దాంటిందంటే వెళ్లలేని పరిస్థితి ఉంది.

మరమ్మతుల్లో జాప్యం

లైట్లు కాలిపోయినా.. వెలగకపోయినా వెంటనే మరమ్మతు చేయాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆస్తి పన్ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారే తప్ప తమకు కావాల్సిన వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ప్రయాణం..ప్రమాదం

- ఇరుకు రహదారితో ఇక్కట్లు
- ప్రమాదానికి గురవుతున్న వాహనాలు
- వెల్లుల్లలో విస్తరణకు నోచుకోని రహదారి
- రహదారి విస్తరణపై దృష్టి సారించని పాలకులు,అధికారులు



వెల్లుల్లలో రహదారి పక్కన డ్రైనేజీలోకి ఒరిగిన లారీ(ఫైల్)



రహదారి పక్కనే ప్రమాదకరంగా డ్రైనేజీ

మెట్‌పల్లిరూరల్: ఇరుకు రహదారుల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వేసిన రహదారులపై ప్రస్తుతం పెరిగిన జనాభా, వాహనాల సంఖ్యతో ఇబ్బందులు తలెత్తున్నాయి. గ్రామాల్లోని ఇరుకైన రహదారులపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ క్రమంలో ముందుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇస్తున్న తరుణంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. రహదారి విస్తరణపై దృష్టి సారించాల్సిన పాలకులు, అధికారులు ఆ దిశగా ఆలోచన చేయడంలేదు.

ఇరుకైన రహదారి

మెట్‌పల్లి మండలం వెల్లుల్లలోని ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగానే పాటిమీది తండా, ఆత్మకూర్, ఆత్మనగర్, రామలచ్చక్కపేట, జగ్గాసాగర్, కేసీఆర్‌తండా, రంగారావుపేట, ఏఎస్‌ఆర్ తండా, విట్టంపేట, నిజామాబాద్ జిల్లా భీంగల్, చౌట్‌పల్లితో తదితర గ్రామాల వాహనదారులు మెట్‌పల్లితోపాటు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే మెట్‌పల్లి నుంచి ఆత్మకూర్, రంగారావుపేట, భీంగల్‌కు ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రైవేట్ పాఠశాల బస్సులతో మరింత రద్దీగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మరోవైపు రహదారికి ఇరువైపులా ఏళ్ల కిత్రం నిర్మించిన డ్రైనేజీ లోతట్టు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉండడంతో భారీ వాహనాలు అందులోకి ఒరిగి బోల్తాపడుతున్నాయి. గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలున్నాయి.

విస్తరణ చేయకపోవడంతోనే..

పెరిగిన జనాభా, వాహనాలకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేపడితేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. విస్తరణపై ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించి రహదారి విస్తరణపై దృష్టి సారించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకోని అంబులెన్స్ డోర్లు

- ఉక్కిరిబిక్కిరైన రోగి
- ఆందోళనలో బంధువులు



డోర్ తెరుస్తున్న డ్రైవర్, రోగి కుమారుడు

జగిత్యాలటౌన్: అంబులెన్స్ డోర్ తెరుచుకోక లోపలున్న రోగి ఉక్కిరిబిక్కిరయ్యాడు. బంధువులు తీవ్ర ఆందోళనకు గురైన ఘటన జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ధర్మపురికి చెందిన గంగయ్యను 108 అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వద్ద వాహనాన్ని నిలిపిన డ్రైవర్.. తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా ఎంతకూ తెరుచుకోలేదు. లోపల ఉన్న రోగి ఉక్కిరిబిక్కిరయ్యాడు. 15నిమిషాలపాటు తలుపులు తెరుచుకోకపోవడంతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. తండ్రితోపాటు లోపలే ఉన్న రోగి కుమారుడు కిటికీ నుంచి బయటకు దూకి 15నిమిషాల పాటు శ్రమించి అంబులెన్స్ తలుపులు తెరిచి గంగయ్యను బయటికి తీసి ఆస్పత్రిలోకి అడ్మిట్ చేశారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడాల్సిన అంబులెన్స్ తలుపులు రోగి ప్రాణాలకు అడ్డంకిగా మారితే రోగులకు సత్వర వైద్యం ఎలా సాధ్యమంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా అంబులెన్స్‌ల నిర్వహణ చర్చనీయాంశంగా మారింది.

➡ మెట్‌పల్లి మండలం వెంకట్రావ్‌పేట శివారులో ఉపాధి కోసం అసైన్‌ల్యాండ్‌లో మొరం తవ్వుకుని అమ్మకాలు సాగిస్తున్న వారిని అటవీ శాఖ అధికారులు నిలువరించారు. తాము బతుకుదెరువు కోసం మొరం తవ్వుతున్నామని స్థానికులు ఆందోళన చేశారు. చివరికి మొరం తవ్వుతున్న వారిపై కేసు నమోదైంది.

➡ నెల రోజులుగా కోరుట్ల మండలం అయిలాపూర్–కల్లూర్ శివారులో మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో అనుమతి లేకుండా మొరం గుట్టల వెంబడి ఉన్న టేకు చెట్లను ఎడాపెడా జేసీబీలతో తొలగించి మొరం తవ్వకాలు చేసి పెద్ద ఎత్తున వ్యాపారం సాగిస్తున్నారు.

➡ ఈ రెండు ఘటనలను పరిశీలిస్తే.. ఏళ్ల తరబడి జీవనోపాధి కోసం మొరం తవ్వకాలు, చిన్నపాటి అమ్మకాలు చేస్తున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. కానీ వ్యాపారం కోసం రాజకీయుల అండతో ఎక్కడికక్కడే టేకు చెట్లను నరికి మొరం తీస్తున్న వారిపై ఎలాంటి చర్యలు లేవన్న విషయం ఇట్టే అర్థమవుతోంది. అధికారుల వివక్షకు కారణం ఏమిటన్న విషయం బహిరంగ రహస్యం.

టేకు చెట్లు నరికి.. మొరం గుట్టలు తవ్వి

- అడ్డగోలుగా మట్టి అక్రమ రవాణా
- పట్టించుకోని రెవెన్యూ..మైనింగ్
- అధికారుల వివక్ష



కోరుట్ల శివారులో టేకు చెట్టు నరికి తవ్వుతున్న మొరం గుట్ట

కోరుట్ల: రెవెన్యూ.. మైనింగ్ శాఖలు మొరం తవ్వకాలు విషయంలో వివక్ష చూపుతున్న వైనం వెలుగు చూస్తున్నా.. అనుమతులు లేకుండా అడ్డగోలుగా మొరం గుట్టలు తవ్వేస్తున్న వారిపై ఎలాంటి చర్యలూ లేవు. ఓ దశలో ఈ రెండు శాఖలు ఫిర్యాదులు వస్తేనే పనిచేస్తాయా..? అన్న అనుమానాలు వస్తున్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి మండలాల్లో పలు గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ మొరం గుట్టలు తవ్వేయడం.. వాటి వెంట అటవీ శాఖ అధ్వర్యంలో నాటిన టేకు చెట్లు నరికేయడం వంటి పనులు నిత్యకృత్యంగా మారాయి.

నాలుగు చోట్ల..

కోరుట్ల మండలంలో చినమెట్‌పల్లి, కల్లూర్–అయిలాపూర్ శివారు, సంగెం గ్రామ సమీపంలో, కోరుట్ల పట్టణ శివారుల్లో మొరం, మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో మొరం గుట్టలను తవ్వి యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో మొరానికి డిమాండ్ పెద్ద ఎత్తున పెరగడంతో అక్రమార్కులు మొరం గుట్టలను తవ్వి పట్టణాల పరిసరాల్లో డంపింగ్ చేస్తున్నారు. కొన్నాళ్ల పాటు నిల్వ చేసి వాటిని మెల్లమెల్లగా ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు నయాపైసా చెల్లించకుండానే మొరం టిప్పర్‌కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు.. ఒక్కో ట్రాక్టర్ మొరాన్ని రూ.1200కు అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో మొరం గుట్టల వెంబడి ఉన్న నాటిన టేకు చెట్లు వందలాదిగా మాయమవుతున్న వైనం కలవరపెడుతోంది. వీటి నరికివేత విషయం అటవీ శాఖ అధికారుల దృష్టిలో లేకపోవడం విడ్డూరం. ఎవరైనా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వేలం వేసి..

కోరుట్ల మండలంలోని చినమెట్‌పల్లి, సంగెం గ్రామాల్లో మొరం గుట్టలను వేలం వేసి మరీ గుట్టచప్పుడు కాకుండా మట్టిని తరలిస్తున్నారు. కొన్ని చోట్ల అనుమతులు తీసుకుని మొరం అమ్మకాలు సాగిస్తుండగా ఈ అనుమతులు కేవలం రాజకీయంగా అండ ఉన్న వారికే దక్కుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. జీవనోపాధి కోసం మొరం తవ్వకాలు చేసేవారికి అనుమతులు ఎందుకు రావడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల వీడీసిలు మొరం వేలంపాటలతో గ్రామాభివృద్ధి కోసం నిధులు సమకూర్చుకుంటున్నామని చెబుతున్నా.. పరోక్షంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. మొరం గుట్టల వేలం పాటల విషయం తెలిసినా మైనింగ్, రెవెన్యూ అధికారులు సరైన విచారణ జరపకపోవడం వెనక కారణాలు అంతుచిక్కడం లేదు. మొరం గుట్టల తరలింపు వెనక పలు పార్టీల నేతలు ఉండటంతో రెవెన్యూ, మైనింగ్, అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న సందేహాలు ఉన్నాయి. అధికార యంత్రాంగం ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోకుంటే కాలక్రమేణా సహజ వనరులు క్షీణించి భారీ వర్షాలకు కోతలు ఏర్పడి గ్రామాల పరిసరాల్లోని వాగులు, చెరువుల్లోకి యథేచ్ఛగా వరద నీరు చేరి మత్తడి దాటి గ్రామాలను ముంచెత్తే అవకాశాలు ఉన్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

మాదిగకుంటను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

- మాజీమంత్రి జీవన్ రెడ్డి



మాదిగకుంటను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్: పట్టణ స్థానిక సంస్థల అభివృద్ధి పథకం కింద రాయికల్ బల్దియాకు మంజూరైన రూ.15 కోట్లతో మాదిగకుంటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మాజీమంత్రి జీవన్ రెడ్డి అధికారులకు సూచించారు. పట్టణంలోని మాదిగకుంటను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి కుంట సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఎస్సారెస్పీ కాలువను అనుసంధానించి కుంటను పరిశుభ్రంగా ఉంచి పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, నాయకులు కొయ్యడి మహిపాల్‌రెడ్డి, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య పాల్గొన్నారు.

బతుకమ్మ చీరెలొస్తున్నాయ్..

- పొదుపు మహిళలకు పంపిణీ
- జిల్లాకు రానున్న 2,39,950 చీరలు
- నిల్వ చేసేందుకు గోదాముల గుర్తింపు



జగిత్యాల: స్వయం సహాయక సంఘాల మహిళలకు దసరా కానుకగా చీరలను పంపిణీ చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారిగా ఎన్ని సంఘాలున్నాయి..? ఎంతమంది మహిళ సభ్యులు ఉన్నారు..? అనేది లెక్కలు తీశారు. జిల్లాకు మొత్తం 2,39,950 చీరలు రానున్నాయి. గతంలో ప్రభుత్వం ప్రతి దసరాకు బతుకమ్మ చీరల పేరిట పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటిసారిగా బతుకమ్మ పండగకు చీరలు ఇవ్వాలని నిర్ణయించింది. బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యేనాటికి మహిళాసంఘాల సభ్యులకు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లాలో గోదాములను గుర్తించి నియోజకవర్గాలుగా పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రేవంతన్న కానుకగా ప్రతి సంఘం సభ్యులకు చీరెలు అందించనున్నారు. మరో రెండుమూడు రోజుల్లో చీరలు జిల్లాకు రానున్నట్లు డీఆర్డీఏ శాఖ అధికారులు తెలిపారు. మెప్మా సిబ్బందికి పంపిణీ బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో గోదాం పాయింట్లను ఏర్పాటు చేశారు.

మండలం	వీవోలు	సంఘాలు	సభ్యులు	6.30 మీటర్ల చీర	9మీటర్ల చీర
ధర్మపురి ఎస్టీ హాస్టల్					
బుగ్గారం	15	433	5,216	4,116	1,010
ధర్మపురి	32	859	9,668	8,218	1,450
ధర్మపురి బల్దియా	15	480	4,800	3,500	
గొల్లపల్లి	44	1,060	12,211	10,205	2,006
వెల్గటూర్	49	1,170	12,695	8,195	4,500
మెప్మా ఆఫీస్, జగిత్యాల					
బీర్‌పూర్	15	444	5,145	2,795	2,350
రాయికల్	40	999	11,562	9,712	1,850
రాయికల్ బల్దియా	16	292	3,267	1,845	1,422
సారంగాపూర్	18	548	6,602	4,401	2,201
జగిత్యాలరూరల్	39	1,060	16,066	10,456	2,610
జగిత్యాల	8	226	2,878	2,248	630
జగిత్యాలబల్దియా	66	2,405	24,541	15,741	6,800
మెప్మా ఆఫీస్, కోరుట్ల					
కోరుట్ల	26	852	10,157	7,223	2,936
కోరుట్ల మున్సిపల్	49	1,422	15,135	12,135	3,000
మెట్‌పల్లి	36	908	10,729	9,114	1,615
మెట్‌పల్లి మున్సిపాలిటి	33	1,219	14,628	12,628	2,000
న్యాక్ కేంద్రం, నూకపల్లి					
పెగడపల్లి	33	926	10,430	7,927	2,503
కొడిమ్యాల	34	932	10,583	9,503	1,050
మల్యాల	40	1036	12,058	10,852	1,206

మహిళలకు అందిస్తాం



ప్రతి సంఘం సభ్యురాలికి బతుకమ్మ పండగ సందర్భంగా చీరలు అందించనున్నాం. జిల్లాకు 2,39,950 చీరలు రానున్నాయి. నిల్వ చేసేందుకు గోదాం పాయింట్లు గుర్తించాం. త్వరలోనే మహిళలకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– రఘువరణ్, డీఆర్డీఏ పీడీ

క్లుప్తంగా

కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


హారిక (ఫైల్)

మల్యాల: కడుపునొప్పితో మండలంలోని రామన్నపేటకు చెందిన ఇంటర్ విద్యార్థిని హారిక (16) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. వెల్గటూర్ మండలం గొడిశెలపేటకు చెందిన ఒడిగ గంగాధర్, వరలక్ష్మి దంపతులు 15 ఏళ్ల క్రితం రామన్నపేటకు వచ్చి ఇక్కడే ఉంటున్నారు. గంగాధర్ లారీ డ్రైవర్. తల్లి వ్యవసాయ కూలీ. వీరి రెండో కూతురు హారిక జగిత్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటోంది. అయినప్పటికీ తగ్గకపోవడంతో ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..


సుప్రియ (ఫైల్)

పెగడపల్లి: మండలంలోని ఎల్లాపూర్‌కు చెందిన మల్లారపు సుప్రియ (27) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందింది. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. సుప్రియ కొంతకాలంగా థైరాయిడ్ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవలే కామెర్ల వ్యాధిబారిన పడింది. ఆసుపత్రుల్లో చూపించుకున్నా ఆరోగ్యం కుదటపడలేదు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 12న బ్లాక్‌రోజ్ పౌడర్ తాగింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సుప్రియ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని మోసం

- రూ.1.25లక్షలు కాజేసిన కేటుగాడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌కు చెందిన ఒక వ్యక్తికి ముద్ర లోన్ ఆఫీసర్ అని ఫోన్ చేసి రూ.5 లక్షల లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. ప్రాసెసింగ్ ఫీజుగా పలు దఫాలుగా రూ.1.25లక్షలు కాజేశాడు. అయినా లోన్ మంజూరుకాకపోవడంతో బాధితుడు ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై కె.రాహుల్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు.

ప్రాజెక్టుల ల్యాండ్‌మార్క్ మిడ్‌మానేరు


తొలిసారి నీటి విడుదల సమయంలో ప్రాజెక్టు అందాలు

బోయినపల్లి(చొప్పదండి): తెలంగాణ ప్రాజెక్టులకు ల్యాండ్‌మార్క్‌లా మధ్యమానేరు నిలుస్తోంది. ఎగువ మానేరు, దిగువ మానేరుకు మధ్యలో ఉన్న మిడ్‌మానేరు 5.8 లక్షల క్యూసెక్కుల వరద పోటును తట్టుకుంటుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద శ్రీరాజరాజేశ్వర(మధ్యమానేరు) ప్రాజెక్టును 27.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. సుమారు రూ.750 కోట్ల అంచనాలతో నిర్మించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2006లో దివంగత సీఎం వైఎస్సార్ ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ఇంజినీర్లందరూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే. ప్రాజెక్టు మొత్తం 32 సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. 25 రేడియల్ గేట్లు, పవర్ ప్యాక్స్, లోకల్ కంట్రోల్ ప్యానల్, రిమోట్ కంట్రోల్ ప్యానల్స్ వంటి కొత్త పద్ధతులు ఉన్నాయి. ప్రాజెక్టులో 4 రివర్స్ స్లూయిస్‌లు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో చేరిన సిల్ట్ రివర్స్ స్లూయిస్‌ల ద్వారా బయటకు వెళ్తుంది. ప్రాజెక్టు నిర్మాణంలో సిమెంట్, కాంక్రీట్, మట్టి, రాతి, స్టీల్, వాడారు. ప్రాజెక్టు అడుగు భాగానికి వెళ్లడానికి గ్యాలరీని ఏర్పాటు చేశారు. దీనిలోకి వెళ్లడానికి మెట్లు, అధునాతన లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులోకి వచ్చే నీరు నిల్వ చేయడం వల్ల ఎయిర్ వెళ్లడానికి గ్యాలరీలో పరికరాలు అమర్చారు. 500 మీటర్ల మేర స్పిల్‌వే, 10 కిలోమీటర్ల మేర కట్టను నిర్మించారు.



పవర్‌ప్యాక్ గది

చరిత్రకు సాక్ష్యం ఎలగందుల ఖిలా


ఎలగందుల ఖిలా

కొత్తపల్లి(కరీంనగర్): చరిత్రకు సాక్ష్యంగా కొత్తపల్లి మండలంలోని ఎలగందుల ఖిలా నిలుస్తోంది. కాకతీయులు, కులీకుతుబ్‌షాహీల శిల్ప కళావైభవానికి ప్రతీకగా ఖిలాలోని కట్టడాలు నిలుస్తున్నాయి. ఈ కోటలో టర్కీ, ఫ్రెంచ్ ఇంజినీర్ల ప్రభావం కనిపిస్తోంది. ఫ్రెంచి, టర్కీ ఇంజినీర్ల ప్రభావంతో ఈ కోట అనేక విషయాల్లో మధ్యయుగపు ఐరోపా శైలిని పోలి ఉంది. 200 అడుగుల ఎత్తు, 2.5 మైళ్ల విస్తీర్ణంలో మానేరునదిని ఆనుకొని ఉంది. ఎలగందుల కోటను కాకతీయులు 1083– 1323 మధ్య నిర్మించారు. ఈ కోటకు మొదటి పేరు 'వెలిగుందుల'. దీనిని మునునూరి నాయకులు, రాచర్ల పద్మనాయకులు ధృడంగా తయారు చేశారు. కోట చుట్టూ సుమారు 5 కిలోమీటర్ల వెడల్పు, 4 మీటర్ల లోతు నీటి కందకాన్ని తవ్వించి మొసళ్లతో నింపి శత్రువుల నుంచి రక్షణగా ఏర్పాటు చేశారు. 16వ శతాబ్దంలో ఈ కోటను కుతుబ్‌షాహీలు ఆక్రమించారు. తర్వాత మొఘల్ సామ్రాజ్యాధీనంలోకి వచ్చింది. హైదరాబాద్ నిజాం పాలనలో నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జాహి (1724–1748) కాలంలో అమీన్‌ఖాన్ ఈ కోట ఖిలేదార్‌గా బాధ్యతలు చేపట్టారు. 1754లో నవాబ్ సలాబత్ జంగ్ కాలంలో మీర్జా ఇబ్రహీం దంసా ఈ కోటను పునర్‌నిర్మించారు. 1905లో ఆరో నిజాం మహబూబ్ అలీఖాన్ జిల్లా కేంద్రాన్ని ఎలగందుల్ నుంచి కరీంనగర్‌కు మార్చారు. కోటలో నీలకంఠస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయాలతోపాటు మసీదు హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

అనంతారం అద్భుతం


అనంతారం ప్రాజెక్టు

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతారం ప్రాజెక్టు 500 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రాజెక్టు ఆయకట్టు దాదాపు 800 ఎకరాల వరకు ఉంటుంది. అనంతారం ప్రాజెక్టు నీటితో నిండితే బిక్కవాగు పరివాహక ప్రాంతమైన అనంతారం, రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట గ్రామాల్లోని పంటలకు సమృద్ధిగా సాగునీరు లభిస్తుంది.

డాక్ బంగ్లా

అనంతారం ప్రాజెక్టు పరిధిలోని డాక్ బంగ్లాను రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. అనంతారం ప్రాజెక్టును పరిశీలించడానికి వచ్చిన ఇరిగేషన్ అధికారులు ఇక్కడే సేద తీరేవారు. డాక్‌బంగ్లా మండలంలో ప్రాముఖ్యత సంతరించుకుంది.


డాక్ బంగ్లా

చెక్కు చెదరని కట్టడాలు

- ఇంజినీరింగ్ ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలు
- సాగు, తాగునీరు అందిస్తున్న ప్రాజెక్టులు
- ఉమ్మడి జిల్లాలో ఆకట్టుకుంటున్న నిర్మాణాలు

ఇంజినీర్ల ప్రతిభకు నిలువెత్తు సాక్ష్యాలుగా ప్రాజెక్టులు నిలుస్తున్నాయి. వందల ఏళ్లుగా చెక్కుచెదరకుండా లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని తల ఎత్తుకొని సేవలందిస్తున్నాయి. నిజాం కాలంలో నిర్మించిన ఎగువమానేరు, ఐదు మత్తళ్ల సింగసముద్రం, అనంతారం ప్రాజెక్టు, మిడ్ మానేరు, ఎలగందుల ఖిలా.. చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నేడు ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు పాతకాలం నాటి నిర్మాణాలపై ప్రత్యేక కథనం.



నిజాం కాలంలో నిర్మించిన గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు


కాకతీయుల కాలంలో నిర్మించిన గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇంజినీర్ల కృషి, ప్రతిభకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు, సముద్రలింగాపూర్‌లోని ఐదు మత్తడుల సింగసముద్రం చెరువు. నిజాం కాలంలో నిర్మించిన కట్టడాలు చెక్కుచెదరకుండా నీటిని అందిస్తున్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వమే..

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు పనులు స్వాతంత్ర్యానికి పూర్వం 1945లో ప్రారంభమైంది. 1948–50 మధ్యకాలంలో పూర్తయింది. నిజాం కాలంలో దాదాపు 18 మంది ఇంజినీర్లు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం ఏళ్లు గడువక ముందే ప్రాజెక్టులు నేలకూలుతుంటే.. వందల ఏళ్లనాడు నిర్మించిన ఈ ప్రాజెక్టు ఆనాటి ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది. మట్టి, రాయి, మిశ్రమంతో చేసిన ప్రధాన బండ వంటి అందుబాటులో ఉన్న పరిమిత సాంకేతిక వనరులతో నిర్మించారు. గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు వంటి పురాతన నిర్మాణం ఇప్పటికీ సాక్ష్యంగా నిలుస్తోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన సింగసముద్రం ఇప్పటికీ చుట్టుపక్కల గ్రామాలకు సేద్యం నీటిని అందిస్తోంది. కాలక్రమంలో ఆధునిక ఇంజినీర్లు దానిని ఐదు మత్తడుల చెరువుగా మార్చి వన్నె తెచ్చారు. ఆ యుగం ఇంజినీర్ల ప్రతిభను మన కళ్ల ముందు నిలబెట్టారు.


సైఫన్‌లోకి వెళ్తున్న ఎస్సారెస్పీ నీరు


సైఫన్ పైభాగం నుంచి ప్రవహిస్తున్న పెద్ద వాగు

అద్భుత కట్టడం.. నాగులపేట సైఫన్

- ఆసియాలోనే అరుదైన కట్టడంగా గుర్తింపు

కోరుట్ల రూరల్: ఇంజినీరింగ్ పనితీరుకు అద్భుత కట్టడంగా నిలుస్తుంది కోరుట్ల మండలం నాగులపేట వద్దగల సైఫన్. ఇది ఆసియాలో అరుదైన కట్టడాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అప్పటి సూపరింటెండెంట్ ఇంజినీర్ పీఎస్.రామకృష్ణారాజు సైఫన్ నిర్మాణానికి డిజైనింగ్ చేశారు. నాగులపేట వద్ద కాకతీయ కాలువ సుమారు 100 మీటర్ల వెడల్పుతో ప్రవహించే పెద్ద వాగు దాటాల్సి ఉంటుంది. వాగుకు అడ్డంగా కాలువ నిర్మించడం కష్టం కావటంతో వాగుపై నుంచే 100 మీటర్ల సొరంగమార్గం తవ్వి.. ఎప్పటిలాగే వాగు ప్రవహించేలా డిజైన్ చేశారు. 100 మీటర్ల పొడవు.. సుమారు 30 ఫీట్ల లోతు.. 25 ఫీట్ల వెడల్పుతో సైఫన్ నిర్మాణం చేపట్టారు. సైఫన్ సొరంగమార్గం ద్వారా కాలువ నీరు.. వాగులో వరద ప్రవాహం.. ఈ అద్భుత కట్టడం ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.


ఇంజినీర్ రామకృష్ణరాజు విగ్రహం

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

రామడుగు(చొప్పదండి): మండలంలోని కిష్టారావుపల్లి గ్రామానికి చెందిన చాట్ల నర్సయ్య (65) చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. ఈ నెల 3న నర్సయ్యకు ఇదే గ్రామానికి చెందిన చాట్ల గంగారాం మధ్య గొడవ జరగడంతో పంచాయితీ నిర్వహించుకున్నారు. పంచాయితీ జరుగుతుండగా గంగారాం, నర్సయ్య మధ్య గొడవ జరిగింది. గంగారాం కుమారుడు భాస్కర్ మా నాన్నను ఎందుకు తిడుతున్నావని నర్సయ్యపై ప్లాస్టిక్ కుర్చీతో దాడి చేయడంతో కిందపడిపోయాడు. అక్కడే ఉన్న సిమెంట్ రాయితో ముఖంపై కొట్టడంతో పాటు గంగారాం కూడా దాడి చేయడంతో నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 6న బాధితుడిని కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

రాయికల్ శివాలయంలో చోరీ

- పోలీస్‌ల అదుపులో నిందితుడు?


రాయికల్ శివాలయంలో హుండీ పగలగొట్టిన దొంగలు

రాయికల్: రాయికల్ పట్టణంలోని శివాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోని హుండిని పగలగొట్టి నగదును దొంగలించారు. దొంగ ముందస్తుగా సీసీ కెమెరాలు పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నించాడు. దానికి ముందు రికార్డయిన వీడియో ఆధారంగా ఆదివారం సదరు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఫేస్‌బుక్‌లో పోస్టుపై పోలీసులు కొట్టారని మనస్తాపం
- సెల్ఫీ వీడియోతో ఎలుకల మందు తాగిన వైనం


ఆత్మహత్యకు యత్నించిన శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తమ ఊరికి బస్సు కావాలంటూ ఓ యువకుడు పెట్టిన పోస్టు అతని ఆత్మహత్యాయత్నానికి దారి తీసింది. అకారణంగా తనను పోలీసులు చావబాదారని మనస్తాపం చెందిన ఆ యువకుడు.. సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఎలుకల మందు తాగాడు. గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్ తమ ఊరికి బస్సు సౌకర్యం కల్పించాలని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. దీనిపై నాచుపల్లి శ్రీనివాస్ ఫోన్ చేసి దూషించాడు. శనివారం ఉదయం మల్యాల పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అక్కడ ఎస్సై నరేశ్ తనను దుర్భాషలాడుతూ రోజంతా చితకబాదారని, అందుకే తాను మనస్తాపంతో ఎలుకల మందు తాగుతున్నాను అంటూ శ్రీనివాస్ వీడియోలో పేర్కొన్నాడు. తన చావుకు ఎస్సై నరేశ్, కాంగ్రెస్ నేత కారణమని, గతంలో తాను ఇదే విషయమై ఎన్ని పోస్టులు పెట్టినా ఏనాడూ ఇలాంటి పరిస్థితి ఎదురవలేదని, పైగా తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని వాపోయాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.

యువకుడిపై కత్తితో దాడి


కత్తిపోట్లకు గురైన వ్యక్తికి చికిత్స అందిస్తున్న వైద్యులు

జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని కరీంనగర్ రోడ్డులో కట్ల శ్రీకాంత్ అనే యువకుడిపై సందీప్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరచడంతో బాధితుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పట్టణంలోని అంగడిబజార్‌కు చెందిన శ్రీకాంత్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గోవిందుపల్లెకు చెందిన సందీప్ ఆటోడ్రైవర్. సందీప్‌కు ఓ పంచాయితీ ఉండడంతో శ్రీకాంత్‌ను మధ్యవర్తిగా తీసుకెళ్లాడు. అక్కడ తనకు కాకుండా ప్రత్యర్థులకు మద్దతు ఇస్తున్నాడని మనసులో పెట్టుకుని సందీప్.. రెండు రోజులుగా శ్రీకాంత్‌కు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు. ఆదివారం రాత్రి సమయంలో ఇద్దరూ కరీంనగర్ రోడ్డులో కలుసుకున్నారు. అక్కడ ఇద్దరి మధ్య మాటామాట పెరిగి శ్రీకాంత్‌పై తన వెంట తెచ్చుకున్న కత్తితో సందీప్ దాడికి పాల్పడ్డాడు. దాడిలో శ్రీకాంత్ చెవ్వు, మెడ, కడుపులో గాయాలయ్యాయి. స్థానికులు శ్రీకాంత్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాంత్ సోదరుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సందీప్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

తల్వార్‌తో జన్మదిన వేడుకలు..

- యువకుడిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని వాణీనగర్‌కు చెందిన కోరుకంటి సాయికృష్ణ అనే వ్యక్తి రోడ్డుపై.. జనావాసాల మధ్య తల్వార్‌ను పట్టుకుని మిత్రులతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం సాయికృష్ణ శనివారం రాత్రి రోడ్డుపై ప్రజలు చూస్తుండగానే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ తల్వార్ చేతపట్టుకుని మిత్రులతో కలిసి కేక్ కట్ చేశాడు. దీంతో పబ్లిక్ న్యూసెన్స్ కింద సాయికృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


తల్వార్‌తో సాయికృష్ణ, మిత్రులు

బీరుసీసాలతో యువకుల దాడులు

- మద్యం మత్తులో వీరంగం
- ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన అనిల్

సుల్తానాబాద్‌రూరల్: మద్యం మత్తులో యువకులు బీరుసీసాలతో స్పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ వైన్స్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్‌లోని మార్కెండేయకాలనీకి చెందిన యువకులు అనిల్, టోనీ ఓ వైన్స్ వద్ద మద్యం తాగారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో ఇద్దరూ బీరుసీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలుకాగా స్థానికులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్యచికిత్స అందిస్తున్నారు.

మిసెస్ చికాగో యూనివర్స్ ధర్మపురి వాసే..


విశ్వసుందరి టైటిల్ అందుకుంటున్న సౌమ్య


ఇద్దరు కూతుళ్లతో సౌమ్య


సౌమ్య (ఫైల్)

ధర్మపురి: ఈనెల 12న న్యూజెర్సీలోని రాయల్ ఆల్బర్ట్స్ ప్యాలెస్‌లో నిర్వహించిన విశ్వసుందరి అందాల పోటీల్లో మిసెస్ చికాగో యూనివర్స్–2026 టైటిల్ గెలుచుకున్న సౌమ్య స్వస్థలం జగిత్యాల జిల్లా ధర్మపురి. ధర్మపురికి చెందిన వొజ్జల మోహన్, సావిత్రి దంపతుల కూతురు సౌమ్య.. 2025 మే 4న మిసెస్ భారత్ ఇల్లినాయిస్ అందాల పోటీల్లో విజయం సాధించారు. తాజాగా మిసెస్ చికాగో యూనివర్స్‌ను గెలుచుకోవడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1985 జనవరి 22న జన్మించిన సౌమ్య బెంగళూర్, నాగాపూర్, ముంబయి, దహను నగరాల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. ధర్మపురికి చెంది.. అమెరికాలో స్థిరపడిన బొజ్జ వాసుతో వివాహమైంది. అనంతరం మిల్వాకి యూనివర్సిటీ నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ పొందారు. ప్రస్తుతం ఆమె ఓ బహుళజాతి సంస్థలో వెబ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి డ్యాన్స్, కొరియోగ్రఫీపై ఉన్న మక్కువతో ఇల్లినాయిస్‌లోని చికాగోలో వస్త్రం బై సౌమ్య అనే ఫ్యాషన్ బోటిక్‌ను స్థాపించారు. 2025లో న్యూయార్క్‌లో ఫ్యాషన్ వీక్ డిజైనర్‌గా అడుగుపెట్టబోతున్నారు. వృత్తిపరమైన బాధ్యతలతోపాటు సామాజిక కార్యకర్తగానూ గుర్తింపు తెచ్చుకున్నారు. గృహహింస బాధితులకు సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సౌమ్య తాజాగా ఈ ఏడాది మార్చిలో ధర్మపురికి వచ్చి వెళ్లారు.

కుటుంబం ప్రోత్సాహంతో..

విశ్వసుందరి పోటీల్లో టైటిల్ గెలుచుకోవడంలో తల్లిదండ్రులు, భర్త సహాయం బాగుంది. ప్రతిభ, అంకిత భావం, కృషి, పట్టుదలతోనే ఈ స్థాయికి ఎదిగాను. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తా.